క్లుప్తంగా

ముస్లిం ధార్మిక సదస్సులో మంత్రి తుమ్మల

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం ఈద్గా ఆవరణంలో జరుగుతున్న తబ్లికి జమాత్ ఇస్లామ్ ధార్మిక సదస్సులో గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో మాట్లాడి నమాజు చేశారు. అనంతరం మత పెద్దలు మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, చోటా బాబా తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు నగరంలోని 15వ డివిజన్‌లో ఉన్న వెలుగుమట్ల అర్బన్ పార్కును సందర్శిస్తారు. 10 గంటలకు 3వ డివిజన్ బల్లేపల్లి జయనగర్‌కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, సంఘం గౌరవాధ్యక్షుడు వెంకన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.బిక్కు, పి.వెంకటరమణ, నాయకులు అజ్మత్ బేగ్, ఆర్.వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, చావా నారాయణరావు, టి.వెంకటేశ్వర్లు, సీత, అరుణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

యాష్ రవాణా ట్రాక్టర్లను అరికట్టాలి

ఖమ్మంరూరల్: పరిశ్రమల నుంచి వెలువడిన యాష్ (బూడిద)ను తరలిస్తున్న ట్రాక్టర్లను నియంత్రించాలని రెడ్డిపల్లి గ్రామస్తులు, స్థానిక పాఠశాల నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి ట్రాక్టర్లు యాష్‌ను రవాణా చేస్తున్న క్రమంలో దుమ్ము, ధూళితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మందు కొడుతుండగా అస్వస్థత

నేలకొండపల్లి: పురుగుల మందు పిచికారీ చేస్తుండగా ఓ రైతు అస్వస్థతకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన వీరబాబు(48) అనే రైతు గురువారం తన పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురికావడంతో స్థానికులు వెంటనే నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

మహిళకు పాము కాటు

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన ఉప్పలమ్మ (36) అనే మహిళను గురువారం పాము కాటేసింది. దీంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	గేమ్ ఛేంజర్
సాయిరాం	డాకు మహారాజ్
ఆదిత్య	గేమ్ ఛేంజర్
శ్రీనివాస	డాకు మహారాజ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	38		20
బెండకాయ	34	పాలకూర	3
పచ్చిమిర్చి	44		20
కాకర	58	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	38	తోటకూర	3
దొండ	64		20
పొట్లకాయ	48	గోంగూర	4
చిక్కుడు	84		20
గోరుచిక్కుడు	54	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	36		40
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	48		25
క్యాప్సికం	58	-ఖమ్మం వ్యవసాయం	

ప్రయాణ గండం...



పోచారం-కిష్టాపురం రహదారిలో చెట్ల మధ్య ప్రమాదకరంగా వ్యవసాయ బావి

ప్రమాదకరంగా రోడ్ల వెంట బావులు, క్వారీ గుంతలు

- ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు
- రాత్రిళ్లు భయంభయంగా ప్రయాణం
- రక్షణ చర్యలు చేపట్టని అధికారులు



కిష్టాపురం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన బావి

కూసుమంచి: ఇటీవల రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వాహనాలు రోడ్ల పక్కన ఉన్న చెరువులు, బావుల్లోకి దూసుకెళ్లి పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చూస్తూనే ఉన్నాం. అయినా మండలంలో ప్రమాదకర ప్రాంతాల్లో అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతాయోనని వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు అనుకుని వ్యవసాయ బావులు, క్వారీ తవ్విన లోయలు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు హడలిపోతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు..

చేగొమ్మ నుంచి ముత్యాలగూడెం, ముత్యాలగూడెం నుంచి పోచారం, కూసుమంచి నుంచి నర్సింహులగూడెం, నేలపట్ల నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న రహదారికి వెళ్లే దారుల్లో రోడ్లకు అనుకుని వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇందులో

☞ కూసుమంచి నుంచి పోచారం వెళ్లే దారిలో కిష్టాపురం వద్ద రోడ్డుకు ఆనుకుని ఉపయోగంలో లేని వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. అధికారులు ఇక్కడ తాత్కాలికంగా రోడ్డు అంచున మట్టితో కట్టను పోసి వదిలేశారు. ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు బావిలోకి దూసుకెళ్లి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది.

☞ ఇక ఇదే దారిలో పోచారం గ్రామ సమీపాన మరో బావి కంపచెట్లతో మూసుకుపోయి కనపడకుండా ఉంది. ఇట్టి ప్రాంతంలో కూడా ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

☞ పోచారం రహదారిలో గతంలో తవ్వి వదిలేసిన గ్రానైట్ క్వారీ లోయలు ప్రమాదభరితంగా మారాయి.అయినా సంబంధిత అధికారులు మాత్రం రక్షణ ఏర్పాటు చేయలేకపోతున్నారు.

ముఖ్యంగా బడి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు ఈ రహదారుల్లో తిరగడం నిత్యకృత్యం. ఇక రాత్రిళ్లు ప్రయాణం చేసేవారు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వెళ్లాల్సిందే. ఇకనైనా అధికారులు స్పందించి ప్రమాదాలు చోటు చేసుకోకముందే అప్రమత్తమై రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రక్షణ గోడలు కట్టాలి..

మా గ్రామం వద్ద రహదారికి ఆనుకుని ఉన్న బావి ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. ఇప్పటి వరకు ప్రమాదాలు జరగకపోయినా బావుల వద్ద రక్షణ గోడలు కట్టి భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– కంచర్ల వెంకటరెడ్డి, కిష్టాపురం

చర్యలు తీసుకుంటాం..

ప్రమాదాలు పొంచి ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు తీసుకుంటాం. అందులో ముఖ్యంగా బావులు, క్వారీల వద్ద రక్షణ గోడలు నిర్మిస్తాం. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే చర్యలు చేపడతాం.

– దేవేందర్, ఆర్అండ్‌బీ ఏఈ

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 19న మహబూబాద్‌లో జరిగే తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య పిలుపునిచ్చారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణాల్లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు పట్టణాల పరిశుభ్రంగా ఉంచి, ప్రజల ఆరోగ్యాలు కాపాడుతున్నారన్నా.. వారికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ మహాసభలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానం వేతనం పర్మినెంట్, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సమస్యలపై చర్చించబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో టీయూసీఐ నగర కార్యదర్శి కొయ్యల శ్రీనివాస్, తెలంగాణ ప్రజల ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దున్న గురవయ్య, పుల్లయ్య, రవి, జానీ, వెంకన్న, నారాయణ, నరసయ్య, అనిల్, రాజు, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను..



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కూసుమంచి: ఈ నెల 25, 26వ తేదీల్లో సంగారెడ్డిలో జరుగు సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో సభల పోస్టర్లను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ పార్టీ నిరంతర పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు మల్లెల హన్మంతరావు, మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, మూడ్ గన్యానాయక్, శీలం గురుమూర్తి, బాపట్ల సత్యనారాయణ, కందుల బాబు, మునగాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ వర్ధంతి సభను..



తిరుమలాయాపాలెం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం: మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు తిమ్మిడి హన్మంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుర్రం అచ్చయ్య పిలుపునిచ్చారు. గురువారం తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా హన్మంతరావు, ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించిన సందర్భంగా అచ్చయ్య మాట్లాడారు. ఈ నెల 21న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే వందేళ్ల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరారు. తిరుమలాయపాలెం కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు ఎన్నబోయిన శ్రీనివాసరావు, ఆరెంపుల వెంకన్న, పిచ్చయ్య, గొర్రెపాటి శ్రీను, వెంకన్న, రఘుబాబు, వీరబాబు, దారుమల్ల శ్రీరాములు తదితరులు పాల్గొనగా.. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, జి.రామయ్య, సీవై.పుల్లయ్య, కోలేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, కె.శ్రీనివాస్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో ఖాళీలు భర్తీ చేయాలి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీజీయూఈఈయూ(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో యాజమాన్యాలను డిమాండ్ చేశారు. ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్కోలలో ఖాళీగా ఉన్న పోస్టులను గత పదేళ్లుగా భర్తీ చేయకపోవడంతో నూతన జిల్లాల్లో సిబ్బంది కొరత వేధిస్తుందన్నారు. వెంటనే జూనియర్ అసిస్టెంట్, జూనియర్ లైన్లమెన్‌లు, ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్, అకౌంట్స్ సెక్షన్లలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, లేని పక్షంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థుల చదువుకు రూ.30 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సురేష్‌నాయక్

రఘునాథపాలెం/ఖమ్మంరూరల్: మండలంలోని రాములుతండాకు చెందిన బానోత్ బాన్‌సింగ్ కుటుంబానికి ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు భూక్య సురేష్‌నాయక్ గురువారం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆర్థిక సాయం కోసం అర్థించగా.. సురేష్‌నాయక్ స్పందించారు. ఈనేపథ్యాన బాన్‌సింగ్ పెద్దకుమార్తె సుప్రియ కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతుండగా.. డిగ్రీ పూర్తి చేసి యూనివర్సిటీలో క్యాట్ కోచింగ్ తీసుకుంటున్న రెండో కుమార్తె ప్రియ, ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో బీకాం చదువుతున్న కుమారుడు ఈశ్వర్‌కు రూ.10వేల చొప్పున ముగ్గురికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ చారి, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ నాయకులు బాలాజీ, బోడ మోతిలాల్, బానోత్ కోటేష్, చంద్రం, తావుర్యా, బోడ లక్పతితో పాటు బండి వెంకన్న, చిన్నయ్య పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని చిమ్మపుడిలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ గ్రామ కమిటీల ఆధ్వర్యాన నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీల్లో హర్యతండ టీమ్ మొదటి బహుమతి గెలుచుకోగా.. రెండు, మూడు స్థానాల్లో గణేశ్వరం టీమ్, చిమ్మపూడి టీమ్‌లు నిలిచాయి. గురువారం ఈమేరకు దాత కోటేరు ఎల్ఐసీ వెంకటరెడ్డి, నిర్వహణ కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్, మండల నాయకులు దొంతూ గణేష్, దశరథ వీరబాబు, వినోద్, వినయ్, జోనెబోయిన నవీన్, షేక్.నఫీర్, సమీర్, అజయ్, సురేష్, వెంకటేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి క్రికెట్, వాలీబాల్ పోటీలు

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో ఈ నెల 23 నుంచి 25 వరకు పెంట్యాల ప్రసాద్ 25వ వర్ధంతి సందర్భంగా క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల ఆర్గనైజర్ పెంట్యాల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి కాగా ఎవరి కిట్లు, బంతులు వాళ్లే తెచ్చుకోవాలని, ఎంట్రీలు ఈ నెల 21 వరకు అందించి మరిన్ని వివరాల కోసం 98856 21047ను సంప్రదించాలన్నారు.

18 నుంచి న్యాయవాదులకు..

ఖమ్మం లీగల్: జనవరి 26ను పురస్కరించుకుని ఖమ్మం కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాస్, చింతనిప్పు వెంకట్ ఆధ్వర్యాన న్యాయవాదులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి ఎ.యుగంధర్ తెలిపారు. జనవరి 18 నుంచి 24 వరకు జరిగే ఈ పోటీల్లో 18న చెస్, 19న క్రికెట్, 20న షటిల్, 21న వాలీబాల్, 22న అథ్లెటిక్స్, 23న కబడ్డీ, 24న పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గి పోటీల్లో పాల్గొనదల్చిన న్యాయవాదులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

క్రికెట్ విజేత.. రైజింగ్ స్టార్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో రైజింగ్ స్టార్ జట్టు విజయం సాధించింది. ముందు బ్యాటింగ్ చేసిన జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 190 పరుగులు చేయగా.. రైజింగ్ స్టార్ జట్టు 24.5 ఓవర్లలో 191 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం బహుమతి ప్రదానోత్సవంలో డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, క్రికెట్ నిర్వాహకులు ఎండీ మతిన్, కోచ్ శివ, పద్మ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఎంపికకు సర్వే



కొమ్మినేపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేసే రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈనేపథ్యాన కొమ్మినేపల్లిలో జరుగుతున్న సర్వేను మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ పరిశీలించి మాట్లాడారు. సర్వే బృందాలు పారదర్శకంగా అర్హులకు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవి, ఆర్ఐ సక్రు, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించాలి



జాబితాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ

రఘునాథపాలెం: ఈ నెల 26 నుంచి ప్రారంభించే ప్రభుత్వ పథకాల్లో పొరపాట్లు జరగకుండా అర్హులను గుర్తించాలని డిప్యూటీ సీఈఓ నాగపద్మజా సూచించారు. గురువారం మండలంలోని రేగులచలక, కోయచలక గ్రామాల్లో పథకాల కోసం సిద్ధం చేసిన జాబితాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి సర్వే ప్రక్రియను పూర్తి చేసి డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇంటి కోసం గుర్తించిన జాబితాలను పరిశీలించి అర్హులకు అందించేలా చూడాలన్నారు. ఇందిరమ్మ సర్వే తీరుపై గ్రామాల వారీగా ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిల ద్వారా సమీక్షించారు.

రైతు భరోసా సర్వే..



కూసుమంచి: జీళ్లచెరువులో వెంచర్ భూములను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్, సిబ్బంది

కూసుమంచి/తిరుమలాయపాలెం: ఈ నెల 26 నుంచి సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో గురువారం సాగుయోగ్యం కాని భూముల గుర్తింపు సర్వేను అధికారులు చేపట్టారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్ అధికారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి సాగుయోగ్యం కాని భూములను పరిశీలించి యాప్ ద్వారా వివరాలను నమోదు చేశారు. ఈనేపథ్యాన కూసుమంచి మండలం జీళ్లచెరువులో సర్వే కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెం, కొక్కిరేణి, తిరుమలాయపాలెం, పాతర్లపాడు గ్రామాలలో గ్రానైట్ క్వారీలు, వెంచర్లు, ఫ్యాక్టరీలు తదితర భూ వివరాలను సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.వి రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఏఓ సీతారాంరెడ్డి, ఆర్ఐ వీరయ్య ఏఈఓ నవనీత తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో విద్యుత్ నిర్వహణ పరిశీలన



షెడ్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈ, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యాన ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఏ.సురేందర్ గురువారం పరిశీలించారు. మార్కెట్ యార్డులోని షెడ్లకు విద్యుత్ సరఫరా విధానం, పంపిణీ వ్యవస్థ, పరికరాల నాణ్యతను ఆయనతో పాటు ఉద్యోగులు తనిఖీ చేశారు. ఈ బృందంలో డీఈ నంబూరి రామారావు, ఏడీఈ నాగార్జున, ఏఈలు ఉండగా.. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే కారణం..

అధికారుల నిర్లక్షంతోనే మార్కెట్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) నాయకులు ఆరోపించారు. మార్కెట్‌లో ప్రమాదస్థలాన్ని గురువారం పరిశీలించిన వారు మాట్లాడుతూ పంటలకు రక్షణ కరువైందని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: వ్యవసాయ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన వారికి ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకుడు డాక్టర్ శీలం పాపారావు డిమాండ్ చేశారు. మార్కెట్‌ను గురువారం పరిశీలించిన ఆయన రైతులు, వ్యాపారస్తుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాపారావు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో రక్షణ లేకపోవడంతోనే ఈ ఘటన జరిగినందున ఇకనైనా ఫైర్ ఇంజన్ సమకూర్చాలని సూచించారు. నాయకులు కొణతం లక్ష్మీనారాయణ గుప్త, గడిల నరేష్, వీరభద్రం, వీరవెల్లి రాజేష్‌గుప్తా, అంకటి పాపారావు, సాయిరాం, పిట్టల వెంకటనరసయ్య, పమ్మి అనిత, దాసు, రాము, శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీమా పథకాలను వినియోగించుకోండి



చెక్కు అందిస్తున్న బ్యాంకు మేనేజర్ మున్నా

తిరుమలాయపాలెం: బ్యాంకుల ద్వారా అందిస్తున్న బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సుబ్లేడు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మున్నా అన్నారు. గురువారం మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన అంగడి నాగమణి అనే మహిళ ఇటీవల మృతిచెందింది. ఈమె ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో చేరి ఉండడంతో ఆమెకు మంజూరైన రూ.2 లక్షల చెక్కును గురువారం కుమారుడు కార్తీక్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం కూల్చివేత..



ప్రహరీని కూల్చివేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ప్రభుత్వ స్థలంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు చేపట్టిన ప్రహరీ నిర్మాణాలను గురువారం కూల్చి వేసినట్లు ఖమ్మంఅర్బన్ రెవెన్యూ ఆర్ఐ వహీద్ తెలిపారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తున్నారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుపై బుధవారం పనులను నిలుపుదల చేయించినట్లు తెలిపారు. తమ పైఅధికారుల సూచనల మేరకు నిర్మాణాలు తొలిగించి ఆ స్థలాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

ఆదమరిస్తే వాగులోకే..!



వాగు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లో ఖానాపురం అలుగు వాగుపై ఒక ప్రైవేట్ పాఠశాల సమీపాన వద్ద ఉన్న శ్లాబు కల్వర్టు అంచుకు మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఆ రోడ్డులో పలు కాలనీలకు చెందిన విద్యార్థులు, నివాసులు రాకపోకలు సాగిస్తుండగా.. అక్కడ అప్రమత్తంగా లేకపోతే వాగులో పడిపోయే అవకాశం ఉంది. పగలే భయానకరంగా ఉన్న ఈ గుంత.. రాత్రయితే మరింత ప్రమాదకరంగా ఉంటుందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇకనైనా కార్పొరేషన్ అధికారులు ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకముందే రక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- ఖమ్మంఅర్బన్